క్లుప్తంగా

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి



ప్రిన్సిపాల్ రామచంద్రరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఎస్ఎఫ్ నాయకులు

సీటీఆర్ఐ: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్వతంత్ర స్టూడెంట్ ఫెడరేషన్ (ఎస్ఎస్ఎఫ్) జిల్లా కార్యవర్గ సభ్యులు అన్నారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వ కళాశాల (అటానమస్)కు విచ్చేసి విద్యార్థులతో మాట్లాడారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం సమర్పించారు. ఎస్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుదే వంశీబాబు మాట్లాడుతూ కళాశాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు తమ సంఘం తరఫున అన్ని విధాలా సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జి.అమర్, కార్యదర్శి బి.వంశీ, ప్రధాన కార్యదర్శి కె.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆ పార్టీ ఆధ్వర్యంలో గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం అమిత్ షా వ్యాఖ్యలకు నిరసన తెలిపారు. అమిత్ షా రాజీనామా చేయాలనే పత్రాన్ని అంబేడ్క విగ్రహం పాదాల చెంత ఉంచారు. కార్యక్రమంలో మార్టిన్ లూథర్, మోతా శారద, అబ్దుల్ షరీఫ్ పాల్గొన్నారు.

వీరభద్రరావు మృతి తీరని లోటు



వీరభద్రరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చందన నాగేశ్వర్

కడియం: వైఎస్సార్ సీపీ నాయకుడు ధర్మాసనం వీరభద్రరావు మృతి పార్టీకి తీరని లోటని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. గురువారం ఆయన వీరభద్రరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే దామిరెడ్డిపల్లి గ్రామంలో కిడ్నీ ఆపరేషన్ చేయించుకుని కోలుకుంటున్న ముద్రగడ మహేష్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.

నర్సరీ సందర్శన



శివాంజనేయ నర్సరీలో అరోమాసింగ్ ఠాకూర్ తదితరులు

కడియం: కడియపులంకలోని శివాంజనేయ నర్సరీని గురువారం సాయంత్రం దక్షిణ మధ్య రైల్వే ఆర్పీఎఫ్ ఐజీ అరోమా సింగ్ ఠాకూర్ కుటుంబ సమేతంగా సందర్శించారు. సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు మొక్కను అందించి వారికి ఘనంగా స్వాగతం పలికారు. ఠాకూర్ కుటుంబ సభ్యులు నర్సరీలో మొక్కలను పరిశీలించారు. వారి వెంట సీనియర్ కమాండర్ వల్లీశ్వర్ బాబూజీ, సైదయ్య, సిబ్బంది ఉన్నారు.

పదో తరగతి స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ విడుదల చేస్తున్న మాజీ కార్పొరేటర్ రమణ, ఉపాధ్యాయులు

కంబాలచెరువు: అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు 45వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కె.రమణ సూచించారు. ఆనంద నగర్ ఉన్నత పాఠశాలలోని 180 మంది విద్యార్థులకు పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) గురువారం అందించింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పదోతరగతిలో మంచి మార్కులు సాధిస్తే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బీఏ శాంతి కుమారి మాట్లాడుతూ ఎస్టీయూ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మది నిండుగా.. పెద్ద పండగ..

- ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు
- పాఠశాలల్లో ఉత్సాహంగా కార్యక్రమాలు
- సంప్రదాయ వస్త్రధారణలో మెరిసిన విద్యార్థులు



కంటిపూడి రామారావు పాఠశాలలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న విద్యాశాఖాధికారి వాసుదేవరావు, ఉపాధ్యాయులు



నాగరాజా ప్రాథమిక పాఠశాలలో వేడుకలు

కంబాలచెరువు: తెలుగువారి పెద్దపండగను సంక్రాంతిని పలు పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. స్కూళ్లకు శుక్రవారం నుంచి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో చివరి రోజు ఉత్సవాలు జరిపారు. కంటిపూడి రామారావు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో జరిగిన ముందస్తు సంక్రాంతి వేడుకల్లో జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ప్రధానోపాధ్యాయుడు పులుగుర్త దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలలో నిర్వహించిన సంక్రాంతి వేడుకలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. ఈఎస్ భాస్కరరావు, లంక మోహన్ ప్రకాష్ జాన్సన్ తదితరులు హాజరయ్యారు.

- కోర్లమ్మపేట నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో అలరించారు. అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, ఎంఈవో 2 రమారజని, సీడీపీవో నర్సమ్మ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ అచ్చియమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సేవా రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- స్థానిక నాగరాజా ప్రాథమిక పాఠశాలలో జరిగిన ముందస్తు సంక్రాంతి వేడుకల్లో అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని మోటూరి మంగారాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు..

సంస్కృతిని కాపాడుకోవాలి

సీటీఆర్ఐ: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే సదుద్దేశంతో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించామని ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవకుమారి అన్నారు. ఆ వుమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాఘవకుమారి భోగిమంటను వెలిగించి సంబరాలకు ప్రారంభం పలికారు. సంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థినులు అలరించాయి.



ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో సంబరాలు

ముగ్గులు, తెలుగు అమ్మాయి, మెహందీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ కేఎస్ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను అందరూ గౌరవించాలి

సంస్కృతి, సంప్రదాయాలను అందరూ గౌరవించాలని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన సంక్రాంతి సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కందుకూరి దంపతుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి వెలిగించి సంబరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రమణమూర్తి, ప్రముఖ నాట్యాచార్యుడు ఆచంట చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ జి.శరత్‌బాబు, డాక్టర్ వై.స్వర్ణశ్రీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కొబ్బరి కాయల మార్కెట్, పెద్ద వీధి, వల్లపు వీధి, చెగిడీ వీధి, కుమ్మరి వీధి, సాయి కృష్ణ థియేటర్ రోడ్డు, మంగళవారపు పేట, మూడు సింహాల బొమ్మ వీధి, కొత్తపేట, దర్గా వీధి, స్టేడియం రోడ్డు, పుష్కరాల రేవు, ఇసుక వీధి, రంగ్రీజు పేట, చందా సత్రం, గుండు వారి వీధి, సదనం పాఠశాల వీధి, నూనెకొట్ల సందు, శంకర మఠం ఏరియా, వంకాయల వారి వీధి, రాళ్లపల్లి వారి వీధి, దాసరి వారి వీధి, పెట్రోల్ బంక్, గోదావరి గట్టు ప్రాంతాల్లో సరఫరా ఉండదు.
- ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకూ కోటిపల్లి బస్టాండ్ ఏరియా, కొవ్వూరు బ్రిడ్జ్ ఏరియా, టి.నగర్ ఏరియాలతో పాటు కొంతమూరులోని భవానీపురం, సంతోష్ నగర్, శానిటోరియం, భాగ్యనగర్ ఏరియాల్లో విద్యుత్ ఉండదు.
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకూ సీతంపేట, మూలగొయ్యి సెంటర్, రామాలయం ఏరియా, ఎన్టీఆర్ కాలనీ, కోటిలింగాల పేట ఏరియాల్లో సరఫరా ఉండదు.
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంట గంట వరకూ వీరభద్రపురం, ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసు, కోరుకొండ రోడ్డు, ఆదెమ్మ దిబ్బ, హరిపురం, సుబ్బారాయపురం, లలితా నగర్ ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుంది.
- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ తొర్రేడు, వెంకటనగరం గ్రామాల్లో విద్యుత్ ఉండదు.

మురమండలో మెడికల్ ల్యాబ్ ఏర్పాటు చేస్తాం

కడియం: మురమండ ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్య పరీక్షలు చేయించడం కోసం గ్రామంలో మెడికల్ ల్యాబ్‌ను ప్రారంభిస్తామని యుఎస్ఏలో స్థిరపడిన మద్దుల వెంకటరావు తెలిపారు. గ్రామంలోని షిరిడీ సాయి పంచాయతన క్షేత్రంలో ఆలయకమిటీ ఆధ్వర్యంలో మద్దుల వెంకటరావు, సత్యదుర్గావాణి దంపతులను గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ నిరుద్యోగులకు ఎలక్ట్రీషియన్, కారు డ్రైవింగ్‌లో శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఈదర పాపారావు, మద్దిపాటి సత్యనారాయణ, ప్రత్తిపాటి వెంకటరామయ్య చౌదరి, చెరుకూరి వీర వెంకట సత్యనారాయణ, ఖండేపు వెంకటరమణ చౌదరి పాల్గొన్నారు.



మద్దూరి వెంకటరావు దంపతులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సీఎం, టీటీడీ చైర్మన్‌ను అరెస్టు చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: తిరుమలలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, టీటీడీ దేవస్థానం చైర్మన్, ఎగ్జిక్యూటివ్ అధికారులను అరెస్ట్ చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఆయన గురువారం రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడారు. తిరుమల మృతులకు ఒక్కొక్కరికి రూ.కోటి నష్ట పరిహారం అందజేయాలన్నారు. పుష్ప సినిమా విడుదల సందర్భంగా జరిగిన దుర్ఘటనకు బాధ్యుడిగా హీరో అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేసిన విధంగానే, పైముగ్గురినీ అరెస్ట్ చేయాలన్నారు.

వలస కార్మికుల సంక్షేమానికి కృషి

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వలస కార్మికులకు మద్దతుగా స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఢిల్లీ నుంచి వచ్చిన వలస కార్మికుల ప్రతినిధి ఫాదర్ ఫ్రాన్సిస్ బాస్కో అన్నారు. పారా సంస్థ – వుమెన్ అండ్ చైల్డ్ ఫ్రెండ్లీ రాజమండ్రి సంయుక్తంగా గురువారం స్థానిక ఏకలవ్య చిల్డ్రన్స్‌హోమ్‌లో వలస కార్మికులకు మద్దతుగా పౌర సమాజ సంప్రదింపుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ ఫ్రాన్సిస్ బాస్కో మాట్లాడుతూ దేశంలోని పది పెద్ద రాష్ట్రాలకు ఇతర రాష్ట్రాల నుంచి పని కోసం ఎక్కువ మంది వలస వెళుతున్నారన్నారు. వీరి సంరక్షణ కోసం ఆయా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో వలస కార్మికులపై విభిన్న అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. వలస కార్మికుల హెల్ప్ లైన్ నంబర్లను ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్యమైన నగరాల్లో ప్రదర్శిస్తామని, వారి సౌకర్యార్థం పలు కార్యక్రమాలు చేపడతామన్నారు. పారా సంస్థ డైరెక్టర్ థామస్ మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా వలస కార్మికుల సంక్షేమానికి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ సూర్యప్రభావతి, ఏఎల్ఓ రాకేష్, ఎఫ్‌డీసీఏ అధ్యక్షుడు సుభాన్, ఆంధ్రా, తెలంగాణ మైగ్రేంట్ వర్కర్స్ ఫోరం ఇన్‌చార్జి అమీర్ పాషా, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, ఛాంబర్ మాజీ అధ్యక్షుడు డి.సత్యంబాబు, అబ్దుల్ కలాం ఫౌండేషన్ అధ్యక్షుడు ఆరిఫ్ పాల్గొన్నారు.

నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి

రాజమహేంద్రవరం సిటీ: పారిశుద్ధ్య కార్మికులు తమ విధి నిర్వహణలో నిబద్ధతతో వ్యవహరించాలని కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. ఆయన గురువారం స్థానిక 8వ డివిజన్ మస్టర్ ఆఫీసులో పారిశుద్ధ్య కార్మికుల హాజరును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల హాజరు వందశాతం ఉండేలా చూడాలన్నారు. తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వేరు చేయకుండా ఇచ్చే వారిపై చర్యలు తీసుకోవాలని గతంలోనే ఆదేశించినా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డు శానిటేషన్ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని హెల్త్ ఆఫీసర్‌ను ఆదేశించారు. గ్రాండ్ ట్రంకు రోడ్డులో వీధి వ్యాపారాలను నియంత్రించాలన్నారు. వారికి వెండింగ్ జోన్లు ఏర్పాటు చేయాలని సిటీ ప్లానర్‌ను ఆదేశించారు.

అన్నా క్యాంటీన్ పరిశీలన

ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ వద్ద గల అన్నా క్యాంటీన్‌ను కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ పరిశీలించారు. క్యాంటీన్‌కు వచ్చే వారికి ఆహారాన్ని సక్రమంగా అందించాలని అక్కడి సిబ్బందికి ఆదేశించారు. క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలు తమ అభిప్రాయాలను తెలియచేయాలని, వాటి ఆధారంగా తదుపరి విధానాలను రూపకల్పన చేస్తామనన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, రెవెన్యూ ఆఫీసరు 2 సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అన్నా క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

మహిళా ప్రాంగణంలో ఉచిత శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని ఎన్టీఆర్ నైపుణ్యాభివృద్ధి, సాధికార సంస్థలో (మహిళా ప్రాంగణం) ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన టైలరింగ్, బ్యూటీషియన్ నాన్ రెసిడెన్షియల్ కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. సంస్థ జిల్లా మేనేజర్ సీహెచ్‌వీ నర్సమ్మ గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. టైలరింగ్ శిక్షణకు 8వ తరగతి, బ్యూటీషియన్ కోర్సుకు పదో తరగతి పాసై, తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న 18 నుంచి 45 సంవత్సరాలలోపు మహిళలు అర్హులని వివరించారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువపత్రం, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువపత్రాలతో ఈ నెల 20వ తేదీలోగా బొమ్మూరు – రాజవోలు రోడ్డులోని మహిళా ప్రాంగణంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. వివరములకు 83339 21340 నంబరులో సంప్రదించాలని ఆమె కోరారు.

జూదాలు వద్దు.. క్రీడలే ముద్దు



బ్యాటింగ్ చేసి సీకే నాయుడు క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

- మంత్రి కందుల దుర్గేష్
- సీకే నాయుడు క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కడియం: పండగ సమయంలో యువకులు కోడి పందేలు, పేకాట వైపు వెళ్లకుండా క్రీడల వైపు మక్కువ చూపాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీశాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సీకే నాయుడు క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కడియం ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ మాట్లాడుతూ భారత మొదటి టెస్ట్ క్రికెట్ కెప్టెన్ సీకే నాయుడు జ్ఞాపకార్థం రెండు దశాబ్దాలుగా కడియం యువకులు టోర్నమెంట్లు నిర్వహిస్తున్న సంగతిని గుర్తు చేశారు. విజేత జట్టుకు రూ.25 వేలు, జ్ఞాపిక, రన్నర్‌కు రూ.15 వేలు, జ్ఞాపిక, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ లకు ప్రత్యేక జ్ఞాపికలు అందజేస్తామని నిర్వాహకుడు పసల నాయుడు అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురాం, సావరం సర్పంచ్ చెక్కపల్లి మురళీకృష్ణ, ముద్రగడ జెమ్మి మాట్లాడారు. పాఠశాల హెచ్ఎం టి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు ప్రభుత్వ జూనియర్ కాలేజీని కొనసాగించాలని వినతి పత్రం అందించారు. ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ మంత్రిపై రచించిన అభినందన పత్రాన్ని చదివి అందజేస్తారు. కార్యక్రమంలో చిలుకూరి ప్రభ, టోర్నమెంట్ నిర్వాహకులు రాజేష్, బాలాజీ, గణ, సాయి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

రైతులందరూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని మంత్రి దుర్గేష్ అన్నారు. మాధవరాయుడుపాలెం గ్రామంలో సర్పంచ్ అన్నందేవుల వీర వెంకట సత్యనారాయణ (చంటి) ప్రకృతి వ్యవసాయ విధానాలలో పండిస్తున్న మినుము, పెసర పంటలను ఆయన సందర్శించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ బి.తాతారావు మాట్లాడుతూ జిల్లాలో 32,393 మంది రైతులు 37,641 ఎకరాలలో, కడియం మండలంలో 1,252 మంది రైతులు 16,083 ఎకరాలలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. సర్పంచ్ చంటి మాట్లాడుతూ ఐదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నానని తెలిపారు.

అవధాన కళావైభవంపై వర్క్‌షాపు



వర్క్‌షాపులో పాల్గొన్న వివిధ విభాగాల అధిపతులు

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాలలోని లలిత కళలు, తెలుగు, సంస్కృత శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అవధాన కళావైభవంపై ఒక్కరోజు అంతర్జాతీయ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ అవధాన వైభవం విద్యార్థులకు తెలియజేయాలన్నారు. లలిత కళల విభాగాధిపతి సీతామహాలక్ష్మి మాట్లాడుతూ సర్టిఫికెట్ కోర్స్ లలిత కళ విభాగం నుంచి విద్యార్థులకు నిర్వహించారన్నారు. తటవర్తి కళ్యాణ చక్రవర్తి ఆస్ట్రేలియా నుంచి ఆన్‌లైన్‌లో పాల్గొని కీలకోపన్యాసం చేయడం అభినందనీయమన్నారు. ఆంగ్లశాఖ నూజిళ్ళ శ్రీనివాస్ రాజమహేంద్రవరానికే తలమానికం ఆర్ట్స్ కళాశాల అనే కళాశాల గీతాలాపన చేశారు. కార్యక్రమంలో భూగర్భశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌతమ్, డాక్టర్ ఎం.సుధామయి, వృక్ష శాస్త్ర విభాగాధిపతి శ్రీనివాస్, భూగర్భ శాస్త్రవేత్త విభాగాధిపతి డాక్టర్ గౌతమ్, భౌతిక శాస్త్ర విభాగం నుంచి డాక్టర్ సంజీవ్, డాక్టర్ పీఏ సత్యనారాయణ, డాక్టర్ ప్రిస్కిల్లా పాల్గొన్నారు.

ప్రత్యేక బోధనపై శిక్షణ ప్రారంభం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో 'బహుళ వైకల్యాలున్న పిల్లలకు కమ్యూనికేషన్ సవాళ్లు, వృద్ధికరమైన ప్రత్యామ్నాయ కమ్యూనికేషన్' అనే అంశంపై మూడు రోజులుపాటు జరిగే శిక్షణ కార్యక్రమాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ (కాకినాడ – రాయుడుపాకలు) సహకారంతో క్యాంపస్‌లోని కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక విద్యలో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్యేక విద్యను బోధించే ఉపాధ్యాయులు నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, సొసైటీ డైరెక్టర్ ఎస్పీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ శ్రీనివాసరావు

రాష్ట్రాభివృద్ధికి కేంద్ర సహకారం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దినకర్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రాభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోదీ రూ.2 లక్షల 8 వేల కోట్లు మంజూరు చేశారని రాష్ట్ర 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ అన్నారు. నగరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం అందించిన సహాయంతో రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి కల్పన, రాష్ట్ర పురోగతి జరుగుతుందన్నారు.

అబ్బురపరచిన ఆలయ నృత్యం



ఆలయ నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారిణులు

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) ప్రాంగణంలో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభలలో గురువారం రాత్రి జరిగిన సాంస్కృతిక, సాహిత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆగమ శాస్త్ర విధానంలో ఇచ్చిన ఆలయ నృత్యం అబ్బురపరిచింది. డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో దివ్యశ్రీ, చంద్రకళ, భువన, నవ్యశ్రీ, లక్ష్మి, సుందరి, రిషి హాసిని, నయనిక, భాను దుర్గ, అశ్రిత అద్భుతంగా నర్తించారు. వారిని జీజీయూ చాన్సలర్ చైతన్యరాజు అభినందించి, సత్కరించారు.